క్లుప్తంగా

కొనసాగుతున్న 'బడిబాట'

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం శనివారం రెండోరోజు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తిరుపతి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ అర్లి(టి) ఫీడర్లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అర్లి(టి), కరంజి, గోమూత్రి, అంతర్గామ్, వడూర్, దనోర గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

భీంపూర్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు అంకం అశోక్ శనివారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కూచిపూడి కోర్సు పరీక్ష రాసిన చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన 28 మంది కూచిపూడి అభ్యసిస్తున్న చిన్నారులు శనివారం జిల్లా కేంద్రంలో కూచిపూడి సర్టిఫికెట్ కోర్సు పరీక్ష రాశారు. లక్నో యూనివర్సిటీ భారతి కళా కేంద్రం నుంచి వచ్చిన ఎగ్జామినర్ సచిన్ దంబారే, రవీష్ గాంధీలు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలో థియరీతో పాటు, చిన్నారుల నృత్య నైపుణ్యాన్ని సైతం పరీక్షించడం జరుగుతుందన్నారు. చిన్నారులంతా పరీక్షల్లో ఉత్తీర్ణులు అవుతారని బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

పరామర్శ

బోథ్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్ట్ మైలారపు అడెల్లు కుటుంబాన్ని శనివారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జైనథ్: జైనథ్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి సతీమణి త్రివేణి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలు వారి నివాసానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

జనసేన సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జనసేన క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుకు సంబంధించిన కిట్లను అందజేశారు. నాయకులు శ్రీరాం అనిల్ కుమార్, చింతవర్ సందీప్, సాయిరి వినయ్, ఉడుగు రవితేజ, జక్కుల కార్తీక్, భూపతి వివేక్, అల్వాల్ సంతోష్ పాల్గొన్నారు.

జొన్నల డబ్బులు జమ చేయండి

బోథ్: రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్మిన జొన్నలకు సంబంధించిన డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో కలిసి మాట్లాడారు. ఒక వైపు రుణాలు పూర్తి స్థాయిలో మాఫీ కాలేదని, మరో వైపు రైతుబంధు కూడా సరిగా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి కూడా పెట్టలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని అన్నారు. వెంటనే జొన్నల డబ్బులను రైతుల ఖాతాల్లో వేయాలని కోరారు.

గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్ నగరానికి చెందిన స్ట్రీట్ కేస్ విజిత్, ఎంఎస్ఆర్, ఆదిలాబాద్‌కు చెందిన స్వస్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు శనివారం మండలంలోని మొలాల గుట్ట, కొలాంగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన వారు గర్భిణులకు, చిన్నారులకు పోషకాహారకార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హేతల్, లక్ష్మణ్ సింగ్, కొండా గోవర్ధన్, సాయి కిరణ్, అక్షయ్, వెంకటేశ్, అశోక్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సరాండి రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- కమ్మేస్తున్న చెట్లకొమ్మలు, ముళ్లపొదలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



రహదారి పక్కన ప్రమాదకరంగా భారీ గుంత



అడుగడుగున గుంతలతో సరాండి రోడ్డు



రోడ్డుపైకి వస్తున్న చెట్ల పొదలు

వాంకిడి: అడుగడుగున గుంతలు, కమ్మేస్తున్న ముళ్ల పొదలతో సరాండి గ్రామానికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన బీటీరోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారి వాహనదారుల పాలిట గండంలా తయారైంది. ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డుపైనే ప్రయాణాలు సాగిస్తున్నా నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టడంతో విఫలమవుతున్నారు. మండల కేంద్రం నుంచి దాదాపుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాండి గ్రామానికి వెళ్లే రహదారితో అటువైపు గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా మారింది.

బీటీ నిర్మించి దశాబ్దాలు..

మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాండి గ్రామానికి వెళ్లే రహదారిపై బీటీ రోడ్డు నిర్మించి దశాబ్దాలు కావస్తోంది. అప్పటి నుంచి రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడం, కొత్త బీటీ మంజూరు చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మూడు కిలోమీటర్ల రహదారి పొడవున చిన్న చిన్న ఒర్రెలపై నిర్మించిన వంతెనల వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. అలాగే పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు కమ్మేస్తున్నాయి. గుంతలు తప్పించే క్రమంలో ముళ్ల పొదలు గాయపరుస్తున్నాయని, ఈ సమస్య రాత్రుల్లో అధికంగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. కొత్త వారు ఈ రహదారి గుండా వెళ్లే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. మండల పరిధిలోని ఖిరిడి, ఇందాని, నవేగాం, నవేగూడ గ్రామ పంచాయతీలలో పదుల సంఖ్యలోని గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంది. దీంతో నిత్యం వందల మంది ఈరోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. అలాగే ఇందాని మీదుగా మహారాష్ట్రకు వెళ్లే వారు కూడా ఉంటారు. ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న రోడ్డు రానున్న వర్షాకాలంలో ఇంకెంత భయంకరంగా మారుతుందోనని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా సమస్యను గుర్తించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



వాంకిడి నుంచి దాదాపుగా మూడు కిలో మీటర్లు ఉన్న రహదారి పూర్తిగా పాడైపోయింది. మరమ్మతులు చేపట్టాలని గతంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు దృష్టి సారించి నూతన ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూడాలి.

– కమలాకర్, మాజీ సర్పంచ్, సరాండి

గుంతలతో ఇబ్బందులు



మండల కేంద్రం నుంచి మా గ్రామం వరకు గల రోడ్డు అడుగడుగున గుంతలతో ప్రమాదకరంగా మారింది. చిన్న వంతెనల వద్ద భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. ముళ్ల పొదలు రోడ్డుపైకి వస్తున్నాయి. అసలే రోడ్డు బాగోలేదంటే ముళ్ల పొదలతో మరో సమస్య తలెత్తుతుంది. పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలి.

– రాజ్‌కుమార్, సరాండి గ్రామస్తుడు

భక్తిశ్రద్ధలతో బక్రీద్



దహెగాం: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కాగజ్‌నగర్‌టౌన్: బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్



రెబ్బెన: ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ చిత్తరంజన్

దహెగాం: మండల కేంద్రంతో పాటు బీబ్రా, కోత్మీర్, లగ్గాం, మొట్లగూడ తదితర గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీబ్రాలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే నూతన దుస్తులు ధరించి ప్రార్థనలు చేసేందుకు పట్టణంలోని ఈఎస్ఐ సమీపంలోని ఈద్గాలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొక్కరు అలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌లు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థన స్థలానికి చేరుకున్న జిల్లా ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ బందోబస్తు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.



ముస్లింలతో ప్రవీణ్‌కుమార్

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గోలేటిలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఏఎస్పీ చిత్తరంజన్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో హఫీజ్ జావిద్ మసీదు కమిటీ అధ్యక్షుడు జహీర్ బాబా, ఉపాధ్యక్షుడు షంషీర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాసీర్ ఉస్మానీ, మతపెద్దలు అబ్దుల్ అజీజ్, నయీ ఆరీఫ్, ఉబెదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో తొలగించిన చెత్త



చెత్త తొలగించడంతో ఆసుపత్రి ఆవరణ



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పేరుకుపోయిన చెత్త శీర్షికతో సాక్షి కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం హుటాహుటిన ఉదయాన్నే కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పేరుపోయిన చెత్తను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కారణమైన 'సాక్షి' కి ఆసుపత్రిలోని గర్భిణీలు, సిబ్బంది కృతజ్ఞతలు తెలి పారు.

'అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు'



మాట్లాడుతున్న మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్

బెజ్జూర్: బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్ హెచ్చరించారు. మర్థిడిలో విలేకరులతో మాట్లాడుతూ బహుజన వాదంతో నియోజకవర్గంలోని యువతను ప్రవీణ్ కుమార్ మోసం చేశారని ఆరోపించారు. బహుజనుల ఆత్మగౌరవాన్ని కాపాడుతానని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికి ఎన్నికలు ముగిశాక పార్టీ మారి కోనప్ప, ఆయన అనుచరులపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యేపై నోరు పారేసుకుంటే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సకారం, శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

కౌటాల: కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న 19 మందిని శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు కౌటాల ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు అదే గ్రామంలో రెండుచోట్ల పేకాట స్థావరాలపై దాడి చేసి పేకాట ఆడుతున్న జి. సంతోష్, యం. జ్యోతిరావు, వి.మధుకర్, టి. శ్యాంరావు, కె. సాయి, యం. రవీందర్, టి. నగేశ్, యం. సురేశ్, టి. శ్రీకాంత్, యం.చిన్న, బి.విలాస్, సీహెచ్ కొండయ్య, సాయికృష్ణ, జి.నాగప్రసాద్, మహేందర్, ఎ.రాజ్‌కుమార్, సీహెచ్ తిరుమలేశ్, ఎ.విలాస్‌లను పట్టుకొని 19 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 11,630 నగదుతో పాటు ఎనిమిది సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు, 104 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

సాత్నాల: మండలంలోని జామిని గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ విధుల గుండా ర్యాలీ చేపట్టారు. గడపగడపకు తిరుగుతూ.. బడీడు పిల్లలను గుర్తించారు. అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో వారికి అడ్మిషన్లు కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ బడీడు, డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు రెండు జతల దుస్తులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: తల్లిదండ్రులు చిన్నారులను ప్రభుత్వ బడికి పంపించాలని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ అన్నారు. టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో రెండో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలన్నారు. శనివారం మండలంలోని దహిగూడ, సల్పాలగూడ, కొలాంగూడ పాఠశాలలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని పరిశీలించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు ఇస్తారి, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లోనే విద్యుత్ స్తంభాలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రాత్రి సమయాల్లో ఆదమరిస్తే ప్రమాదాలు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



సిర్పూర్(టి) -మాకిడి రహదారిలో దుబ్బగూడ సమీపంలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం



స్థానిక డౌనల్ ప్రాంతంలో రోడ్డుకు ఆనుకొని విద్యుత్ స్తంభం

సిర్పూర్(టి): మహారాష్ట్రకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు మండలంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు తప్పడం లేదు. మండలంమీదుగా ఉన్న ప్రధాన రహదారులలో వాహనదారులకు, ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తున్న విద్యుత్ స్తంభాలున్నప్పటికీ సంబంధిత విద్యుత్‌శాఖ ఎలాంటి నివారణ చర్యలు తీసుకోకపోవడంపై నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకుని, రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు ఉండటం వాహనదారులకు శాపంగా మారింది. ఏళ్లుగా రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో ప్రధాన రహదారుల గుండా ప్రయాణాలు సాగించే వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ప్రధాన రహదారుల్లో ఆదమరిస్తే రోడ్డు ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి ఉంది. సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బస్టాండ్ నుంచి డౌనల్ వెళ్లే ప్రధాన రహదారిలో డౌనల్ సమీపంలోని వెంకటేశ్వరాలయం ముందు ఉన్న విద్యుత్ స్తంభం రోడ్డుకు ఆనుకుని ఉండగానే నూతన సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం మాత్రం ఇప్పటి వరకు తొలగించలేదు. ఈ రహదారిలో సిర్పూర్(టి) గ్రామపంచాయతీ ప్రజలతో పాటు సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని గ్రామాల ప్రజలు ప్రతీరోజు ప్రయాణాలు సాగిస్తుంటారు. వెంకట్రావ్‌పేట్ -పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా మహారాష్ట్రకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిర్పూర్(టి) -మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలోని దుబ్బగూడ కాలనీ సమీపంలో రోడ్డుకు ఆనుకుని విద్యుత్ స్తంభం ఉండటంతో ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులకు ఇ బ్బందులు తప్పడంలేదు. మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు మహారాష్ట్ర పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతినిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత శాఖ అధికారులు తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు



మండలకేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో గల ప్రధాన రహదారిలోని విద్యుత్ స్తంభంతో పాటు మండలంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లకు ఆనుకుని విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో ఇరువైపులా ఒకేసారి వాహనాలు వస్తే ఇబ్బందులు తప్పడంలేదు. వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలి.

– డి. కరుణాకర్‌గౌడ్, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారుల్లో వాహనదారులకు ఆటంకంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించకుండా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలి.

– కె.కృష్ణ, బోర్లకుంట, మం.దహెగాం

పంట చేలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: వర్షాకాలంలో తమ పంట చేలకు వెళ్లేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను దూరం చేసేలా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతుల పంటచేలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. రూ.28 లక్షల వ్యయంతో ఐదు కిలోమీటర్ల మేర నిర్మించనున్న మట్టి రోడ్డు పనులను రైతులతో కలిసి ప్రారంభించారు. విడతలవారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు వర్షాకాలంలో కూడా చేనులకు వెళ్లే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో పాల్గొన్న సభ్యులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నిర్వహించే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 77వ వారానికి చేరుకుంది. హనుమాన్ చాలీసా పారాయణం వల్ల భక్తిశ్రద్ధలు, ఏకాగ్రత, ఆధ్యాత్మిక భావన , క్రమశిక్షణ, మంచి భావాలు అలవరుతాయని సభ్యులు పేర్కొన్నారు. వంద వారాల పాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతుందని వారు తెలిపారు.